క్లుప్తంగా

ఆటల పోటీలు


తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బుధవారం బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. సూపర్ జూనియర్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలకు విద్యార్థులను విభజించి రింగ్స్ గేమ్, పిరమిడ్ గేమ్, బాల్ అండ్ స్క్వేర్స్ గేమ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరావు, క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.వెంకయ్యలు బహుమతులు అందజేశారు. సచివాలయ సంరక్షణా కార్యదర్శి ఇందు, అబ్రహం, రుద్రపాటి రాజనాథ్, రాజేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



తెనాలిఅర్బన్: మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్ర స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్‌లో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శెట్టి లావణ్య, డాక్టర్ బేబీజాన్, డాక్టర్ దాసరి రిచర్డ్స్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన దుర్గమ్మ తల్లి తిరునాళ్ల



తెనాలిటౌన్: బాలాజీరావుపేట–కఠెవరం గ్రామాల మధ్య ఉన్న అయ్యప్ప ప్రధాన ఆలయం ఆవరణలో జరుగుతున్న దుర్గమ్మతల్లి అమ్మవారి తిరునాళ్ల బుధవారంతో ముగిశాయి. ప్రధాన అర్చకుడు దుర్భా హరిబాబు స్వామి అమ్మవారికి పూజలు జరిపారు. పెద్ద రథంలో అమ్మవారిని ఉంచి పురవీధులలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, చెక్క భజన, బ్యాండ్ మేళాలతో అయిదు రకాల దేవతామూర్తుల అలంకరణలో ప్రదర్శనలు చేశారు. ప్రధాన అయ్యప్ప దేవాలయం వారి దుర్గమ్మ తల్లి మహిళా మండలి భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల



తెనాలిఅర్బన్: రామలింగేశ్వరపేట పుట్టా రాఘవయ్య రైస్‌మిల్ సమీపంలోని లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతిమ్మ తల్లి తిరునాళ్ల బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రభ కట్టి వీధుల్లో ఊరేగించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు ప్రారంభించారు. సుమారు రెండు వేల మందికి అన్నసంతర్పణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కొండూరు శివయ్య మేస్త్రి, కాళిదాసు ప్రభు, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, చెన్ను శ్రీనివాసరావు, భుక్యా జగ్గారావు, దుడ్డింపూడి నాగరాజు, కాళిదాసు దాసు, బండారు రవికాంత్ పాల్గొన్నారు.

కోలాటం మాస్టర్ అప్పారావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం మిస్సమ్మ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం బభ్రువాహన చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కోలాటం మాస్టర్ దానబోయిన అప్పారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోగినేని రమేష్ బాబు, కొత్తపల్లి రమేష్, కనగాల శ్రీనివాసరావు, ముళ్ళపూడి వెంకట్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్‌టీఆర్ జగన్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం



తెనాలిఅర్బన్: ఎస్ఎస్ కంప్యూటర్ అకాడమీలో వివిధ కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన 200మంది విద్యార్థులకు బుధవారం ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, గిరి, శివ, శ్రీమన్నారాయణ, రమేష్, ఎబినైజర్, సంజన, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలతో నియంత్రణ



కుక్కలకు శస్త్ర చికిత్సలు చేస్తున్న వైద్యులు



శస్త్ర చికిత్స అనంతరం అబ్జర్వేషన్‌లో ఉంచిన కుక్కలు

తెనాలిలో తగ్గిన కుక్కల బెడద

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వీధి కుక్కల బెడద కొంతమేర తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో కుక్కల శస్త్ర చికిత్సాలయంను పునఃప్రారంభించి వాటి ఉత్పత్తిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా వీధి కుక్కలను పట్టుకుని వాటికి సంతానోత్పత్తిని నియంత్రించే శస్త్ర చికిత్సలు చేసి వాటిని పట్టుకున్న చోటే వదిలేస్తున్నారు. దీంతో కుక్కల బెడదపై వచ్చే ఫిర్యాదులు కొంత మేర తగ్గాయి.

రూ.20 లక్షలతో శస్త్ర చికిత్సాలయం..

తెనాలి పట్టణ పరిధిలోని వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో రూ.20 లక్షలతో కుక్కల శస్త్ర చికిత్సాలయంను నిర్మించారు. దీనిలో ఒక షెడ్‌లో కుక్కల సంరక్షణ గదులు, రెండో షెడ్‌లో శస్త్ర చికిత్స గదులను ఏర్పాటు చేశారు. యానిమల్ కేర్ ల్యాండ్ సంస్థ ద్వారా సుమారు 800 శస్త్ర చికిత్సలు చేశారు. షెడ్ కొద్ది సంవత్సరాలకే పడిపోవటంతో శస్త్ర చికిత్సలను నిలిపివేశారు. కుక్కల బెడదపై ఎక్కువగా ఫిర్యాదులు రావటంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు అధికారులకు, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు శస్త్రచికిత్సాలయంను పునఃనిర్మించాలని కోరారు. దీంతో 2022 ఏప్రిల్‌లో దానిని రూ.5 లక్షలతో మరమ్మతులు జరిపించి, పునఃనిర్మించి దానిలో శస్త్రచికిత్సలు చేయటం ప్రారంభించారు. శస్త్ర చికిత్సలు చేసేందుకు ముగ్గురు పశు వైద్యులను కూడా నియమించారు. వారంలో రెండు రోజులు వాటికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

శస్త్ర చికిత్సలు చేసే విధానం ఇది..

మున్సిపల్ అధికారుల సూచన మేరకు వీధి కుక్కలను వలల ద్వారా పట్టుకుంటారు. అక్కడే కుక్కకు జియో ట్యాగ్‌ను వేసి ఆన్‌లైన్‌లో దాని ఫొటోను అప్‌లోడ్ చేస్తారు. అనంతరం దానిని వ్యాన్‌లో చికిత్సాలయానికి తరలించి సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్స చేసి రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచుతారు. తరువాత దానిని ఎక్కడ పట్టుకున్నారో అక్కడే వాటిని వదిలి వేస్తారు.

50శాతంపైగా కుక్కలకు శస్త్ర చికిత్సలు పూర్తి..

తెనాలి పట్టణంలోని కుక్కల వివరాలను సచివాలయ సిబ్బంది సేకరించారు. వారి లెక్కల ప్రకారం తెనాలి పట్టణంలోని 40 వార్డులలో 977 వీధి కుక్కలు ఉన్నట్లు తేల్చారు. ఇప్పటి వరకు సుమారు 600కుపైగా కుక్కలకు శస్త్ర చికిత్సలు చేశారు. మిగిలిన వాటికి కూడా అతి కొద్ది నెలలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. మంగళగిరి, తాడేపల్లి పరిధిలో కుక్కల శస్త్ర చికిత్సాలయం లేకపోవటం వల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా మున్సిపాలిటీల పరిధిలోని వీధి కుక్కలను కూడా ఇక్కడికి తీసుకువచ్చి వాటికి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. మొత్తం మీద శస్త్ర చికిత్సాలయం వల్ల తెనాలిలో చాలా వరకు కుక్కల బెడద తప్పినట్లయింది.

శస్త్ర చికిత్సలతో బెడద తగ్గింది..



తెనాలి పట్టణంలోని వీధి కుక్కల సమస్యను తొలగించేందుకు శస్త్ర చికిత్సాలయంను ఏర్పాటు చేశారు. అక్కడ వాటికి సంతానోత్పత్తిని నియంత్రించే శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. ఇలా చేయటం వల్ల కుక్కల పునరుత్పత్తి తగ్గి ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది. తెనాలిలో ఇంకా ఎక్కడైనా కుక్కల సమస్య ఉంటే వెంటనే మాకు తెలియజేయండి. వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

–ఎం.గోపాలరావు, అసిస్టెంట్ కమిషనర్, తెనాలి పురపాలక సంఘం.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న రైల్వే మహిళా ఉద్యోగులు



డాక్టర్ ఉమాదేవిని సత్కరించిన అధ్యాపక సిబ్బంది



జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

తెనాలిరూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వివిధ మహిళా సంఘాలు, యూనియన్‌లు ఘనంగా నిర్వహించారు. తెనాలి రైల్వే స్టేషన్‌లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిపారు. యూనియన్ బ్రాంచ్ ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మహిళా ఉద్యోగులను ప్రతిపాదించారు. డివిజనల్ మెడికల్ ఆఫీసర్ చైతన్య, స్టేషన్ మేనేజర్ డి.శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొని దేశ ప్రగతిలో మహిళల పాత్ర గురించి ఉపన్యసించారు. అలానే రైల్వే శాఖ పురోగతిలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలమని చెప్పారు. విజయకుమారి, జ్యోతి, ఇందిర, పరమగీతం, జయంతి, రిబ్కా, స్వరూపరాణి, బేగం, శ్రీలత, అనూష, కోటేశ్వరమ్మ, రోజమ్మ, శ్వేత, కుమారి తదితర మహిళా ఉద్యోగులు కేక్‌ను కట్ చేశారు. మజ్దూర్ యూనియన్ కార్యదర్శి జి.రవిబాబు, చైర్మన్ బి.ప్రభాకరబాబు, బి.రామస్వామి డి.ప్రసన్న, బి.రామకోటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఏఎస్ఎన్ ఫార్మశీ కళాశాలలో...

తెనాలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజీలో సందడిగా నిర్వహించారు. విద్యార్థులు ఫుడ్, గేమ్ స్టాల్స్ ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా కంటి వైద్య నిపుణులు డాక్టర్ టి.ఉమాదేవి హాజరయ్యారు. అమ్మాయిలు ధైర్యంగా ఉండాలనీ, సమాజంలో గౌరవాన్ని కాపాడుకోవాలనీ, తాత్కాలిక ప్రలోభాలకు లోనుకారాదని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షత వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అధ్యాపక సిబ్బంది డాక్టర్ ఉమాదేవిని, అసోసియేట్ ప్రొఫెసర్ చందోలు నాగశైలజ, అధ్యాపకేతర సిబ్బంది ఎల్.భార్గవిని సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఫ్యాషన్ షో, నృత్య, పాటల పోటీలను నిర్వహించారు.

జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో..

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని జై భీమ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవం జరిపారు. ఫెడరేషన్ మహిళా నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కఠెవరపు దేవయ్య మాట్లాడారు. మహిళలకు పోటీలు జరిపి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిలకా సుమతి, ఎంపీటీసీ సభ్యురాలు పేరం అరుణ, కుమారి, ఎస్తేరు రాణి, కోడూరు నాగమల్లేశ్వరి, పొన్నెకంటి హైమావతి, ఫెడరేషన్ నాయకులు కె.అబ్రహం లింకన్, కొత్తపల్లి రామారావు, రమావత్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రధాన పోస్టాఫీసులో...

తెనాలి: పట్టణ కొత్తపేటలోని ప్రధాన పోస్టాఫీసులో బుధవారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, మహిళా ఉద్యోగుల సంక్షేమం అంశాలపై ప్రసంగించారు. తెనాలి డివిజను పరిధిలోని పోస్టల్ శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేటు వెంచర్లతో మూతపడుతున్న డ్రెయినేజ్‌లు

తాడికొండ: ప్రైవేటు వెంచర్ల జోరుతో గ్రామాల్లోని మురుగు, వరద నీరు బయటకు వెళ్లే డ్రెయిన్‌లు మూతపడుతున్నాయి. తమ వ్యాపారం కోసం అనుమతులు లేకుండానే పదడుగులు పైన ఉన్న డ్రెయిన్‌లను చిన్నపాటి పైపులు వేసి పూడ్చివేస్తుండటంతో వర్షాకాలం ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాం, పొన్నెకల్లు, తాడికొండ, నిడుముక్కల, మోతడక, ఫణిదరం, దామరపల్లి, పలు గ్రామాల పరిధిలో ఈ ఏడాది ప్రైవేటు వెంచర్లు భారీగా వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా వేస్తున్న పలు ప్రైవేటు వెంచర్ల నిర్వాహకులు డ్రెయిన్‌లను మూసివేసి లే అవుట్‌లు వేస్తుండటం పరిపాటిగా మారింది. ఇటీవల లాం గ్రామంలో వేసిన ప్రైవేటు వెంచర్‌పై గ్రామస్తులు వ్యతిరేకత వ్యక్తం చేసి తొలగించాలని సూచించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్‌లను అడ్డగోలుగా పూడ్చివేసే ప్రక్రియకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



తాడికొండలో పైపులైన్‌లు వేసి మూసివేస్తున్న భారీ డ్రెయిన్

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రకటించిన రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన గోశాల బుజ్జి ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో తన కాలుకి మరియు చేతికి శస్త్ర చికిత్స జరిగిన పనులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో ఆమె కుమారుడు జీవన్ ఎమ్మెల్యేకు వాట్సప్ సందేశం పంపగా ఎమ్మెల్యే స్పందించి సాయం ప్రకటించారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సుభాని,రాజేష్, దానబోయిన బాబు, గ్రామ కన్వీనర్లు దాసరి కెజియా, కావూరి అశోక్, దుళ్ల సాంబశివరావు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

చింతలపూడిలో..

మండల పరిధిలోని చింతలపూడి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదశాత్తు రెండవ అంతస్తు నుంచి కిందపడి కాళ్లు చేతులు చచ్చుపడిపోయి ఇంట్లోనే ఉండడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉండడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే రూ. 25 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

మంగళగిరి: యర్రబాలెం బసవతారక నగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. వివరాలు.. బసవతారకనగర్‌కు చెందిన తొమటం ఆనందరాజు, భూలక్ష్మి దంపతుల కుమారుడు ఏసు నగర పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం తన సోదరునితో కలిసి ఇంట్లో ఆడుకుంటుండగా గమ్ బాటిల్ నేలపై ఒలకగా తల్లి భూలక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన ఏసు అదే రోజు మధ్యాహ్నం అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి సమయమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు తమ కుమారుడు ఏసుబాబు ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

మాలధారులకు అన్నదానం

మంగళగిరి: లక్ష్మీ నృసింహస్వామి మాల ధారణ 41 రోజులు పూర్తి చేసుకున్న స్వాములకు బుధవారం అన్నదానం చేశారు. తోట శ్రీనివాసరావు మిత్ర బృందం ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి డేవిడ్ రాజు, శివాలయం మాజీ చైర్మన్ మునగపాటి హాజరయ్యారు.

దుప్పట్లు పంపిణీ

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఆల్ గ్రీన్ షీల్డ్స్ (ఏజీఎఫ్) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏజీఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచి చొప్పర ప్రీతి రత్నకుమారిలు మహిళలకు దుప్పట్లు అందజేశారు. ఏజీఎఫ్ నిర్వాహకులు డోగిపర్తి శైలజ, చొప్పర అపర్ణ, స్వప్నల సహకారంతో సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేశారు. ఏజీఎఫ్ ప్రతినిధి రత్నకుమారి, యానిమేటర్లు శ్యామల, సత్యవతి, హన్నా మణి, యల్లమాటి రత్నకుమారి, స్వర్ణకుమారి, కోడూరి సుభాషిణి, మహిళలు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న సర్పంచి ప్రీతి

నేడు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్ గురువారం నిర్వహించనున్నట్లు ఉద్యోగాల కల్పన డీన్ డాక్టర్ ఎస్.బి.కె.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ కోర్సులు పూర్తి చేసుకున్న ఆరువేల మంది విద్యార్థులకు అత్యుత్తమ ప్యాకేజీలతో అనేక ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధించడంతో ఈ సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 2005 నుంచి వందశాతం ప్రాంగణ ఎంపికల్లో విజయం సాధిస్తూ కేఎల్‌యూ పలుమార్లు రికార్డులు సృష్టించిందని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం మెరిట్ విద్యార్థుల కోసం తమ విశ్వవిద్యాలయం కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు వివరించారు. నేడు సాయంత్రం జరుగనున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్‌కు రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్, పక్కన సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్: తెనాలి పరిసర ప్రాంతాల యువతను టార్గెట్ చేస్తూ గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ కె. స్రవంతిరాయ్ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా ఈపూరు మండలం అగ్నిగుండాల గ్రామానికి చెందిన 19 ఏళ్ల కైపు నాగార్జున రెడ్డి గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తనకు బావ వరుస అయ్యే మేడగం రమణారెడ్డి(పుల్లలచెరువు మండలం బీరినేనిపల్లి), అతడి స్నేహితుడు లికిత్‌కుమార్(హంసలదీవి)తో కలిసి ఒకే గదిలో ఉంటున్నారు. ముగ్గురికి గంజాయి తాగే అలవాటుతో పాటు ఇతర చెడు వ్యసనాలు ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు. ఈ క్రమంలో ముగ్గురు కలిసి గంజాయి వ్యాపారం చేసి అక్రమమార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. విశాఖపట్నం జిల్లాలోని కొండ ప్రాంతాలలో నివసించే గిరిజనుల వద్ద గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి కాలేజీ విద్యార్థులు టార్గెట్‌గా చిన్న చిన్న ప్యాకెట్లు చేసి గుంటూరు, తెనాలి పట్టణాలలో అమ్మకాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం నాగార్జునరెడ్డి గంజాయి తీసుకుని గుంటూరులో ఆర్టీసీ బస్సు ఎక్కి నందివెలుగు జంక్షన్ వద్ద దిగాడు. అదే సమయంలో అక్కడ రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సిహెచ్. వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులను చూసిన నాగార్జునరెడ్డి కంగారుపడుతూ పరారయ్యే ప్రయత్నం చేయగా, అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 1200 గ్రాముల గంజాయిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడితో పాటు విక్రయాలు చేస్తున్న మిగిలిన ఇద్దరిని అరెస్ట్ చేయాల్సి ఉందని డీఎస్పీ చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ, ఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్ పి. మణికుమార్, సిబ్బంది శ్రీనివాసులు, రాము, గోపాలకృష్ణలను డీఎస్పీ అభినందించారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి జయంతి



మాట్లాడుతున్న ప్రజ్ఞానంద సరస్వతి

తెనాలి: సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో బుధవారం మహాలక్ష్మి అమ్మవారి జయంతి మహోత్సవాలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సామూహిక మణిద్వీప వర్ణన గళార్చన ఘనంగా నిర్వహించారు. పూజ్యశ్రీ ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) నేతృత్వంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. రచయిత శివకవి తొమ్మిదిసార్లు మణిద్వీప వర్ణనను గానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. హైందవ ధర్మ ప్రాముఖ్యతపై కొండవీటి జ్యోతిర్మయి ఉపన్యసించారు. అలాగే అన్నమయ్య కీర్తనలను హృద్యంగా ఆలపించారు. ఎస్.అనంతలక్ష్మి ప్రవచనం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సాలిగ్రామ మఠం ట్రస్ట్ చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రశంసించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంతోపాటు మహిళా దినోత్సవం జరపటాన్ని అభినందించారు. మహిళ విశిష్టతను ఆయన సోదాహరణంగా వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు అగ్రాసనం వేస్తున్నారని గుర్తుచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ తన ప్రసంగంలో భారతదేశంలో కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పని చెప్పారు. తెనాలి డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ఫలితంగానే నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్‌ను సాలిమఠం ట్రస్ట్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సిద్ధా లక్ష్మీపద్మావతి, పాతూరి వెంకట ఆదిలక్ష్మి, బూరెల అరుణకుమారి, తూనుగుంట్ల దుర్గాభవాని, నాగవరపు లక్ష్మీసామ్రాజ్యం, గడ్డిపాటి శ్రీనివాసరావు, ఉమాదేవిని కూడా సన్మానించారు. ముద్దాబత్తుని రమణయ్య పర్యవేక్షించగా, డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మ సభానిర్వహణ చేశారు. రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ, మాల్యాద్రి పాల్గొన్నారు.

ముగిసిన అష్టలక్ష్మీ అమ్మవార్ల జయంతి



అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహాకుంభాభిషేకం

తెనాలి: పట్టణ కొత్తపేటలోని అష్టలక్ష్మీ దేవాలయంలో అష్టలక్ష్మీ అమ్మవార్ల 25వ జయంతి రజతోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన బుధవారం అమ్మవారికి మహాకుంభాభిషేకం చేశారు. అనంతరం సహస్ర నామార్చనను నిర్వహించారు. నంగూరు కాళీ వనాశ్రమ పీఠాధిపతులు పూజ్యయోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ అధ్యక్షతన అష్టలక్ష్మీ పీఠం సంస్థాపకుడు దిండి స్వాములు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్నుంచి పలువురు పీఠాధిపతులు హాజరైన విషయం తెలిసిందే. స్థానిక కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం నిర్వహణలో మూడురోజులు వైభవంగా జరిగిన ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చివరిరోజు మధ్యాహ్నం నుంచి స్థానిక ఎన్జీఓ కళ్యాణమండపంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చిన్నారులతో చలివేంద్రాన్ని ప్రారంభింపజేస్తున్న సర్పంచి పవన్‌కుమార్

తెనాలిటౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని నందివెలుగు సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకుడు ధూళిపాళ్ళ పవన్‌కుమార్ పేర్కొన్నారు. తెనాలి–విజయవాడ రహదారిపై రూరల్ మండలం నందివెలుగు మెయిన్‌సెంటర్‌లో 'మేము సైతం' యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని సర్పంచి పవన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేము సైతం సేవా సంఘం సభ్యులు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సేవా సంఘం సెక్రటరీ షేక్ షకూర్ బాషా మాట్లాడుతూ గత అయిదు సంవత్సరాల నుంచి చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ ఈ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చుతున్నామన్నారు. సేవా సంఘం అధ్యక్షుడు కల్యాణం సాంబశివరావు, ఉపాధ్యక్షుడు యర్రమోతు జగన్మోహనరావు, కార్యదర్శి షకూర్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.

స్థాపితం: 1906 ఫోన్ : 08644-228894

నెం.22 ది.తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్
బి.బి.రోడ్, కొత్తపేట, తెనాలి

సర్వసభ్య సమావేశపు నోటీసు

మన బ్యాంకు యొక్క సర్వసభ్య సమావేశము ది.28-03-2023 మంగళవారం మధ్యాహ్నం గం.4.00ని॥లకు బ్యాంకు ఆవరణలో జరుపుటకు నిర్ణయించడమైనది. కావున 'ఎ' తరగతి సభ్యులు తప్పక విచ్చేయవలసినదిగా ఆహ్వానించడమైనది.

గమనిక: ఒకవేళ ది.28-03-2023 మంగళవారం నాటి సమావేశమునకు తగిన కోరము లేని యెడల ది.29-03-2023 బుధవారం మధ్యాహ్నం గం.4.00ని॥లకు బ్యాంకు ఆవరణలో సర్వసభ్య సమావేశము జరుపబడును.

ఎజెండా:
1) 2023-2024 సం॥నకు అంచనా బడ్జెట్‌ను ఆమోదించుటం గురించి.
2) 2023-2024 సం॥నకు కన్‌కరెంట్ ఆడిటర్‌ను నియమించుట మరియు వారికి చెల్లించవలసిన ఫీజును నిర్ణయించుట గురించి.
3) బ్యాంకు సబ్‌లా బైలా నెం.23ను Amendment చేయు విషయం గురించి
4) పర్సన్ ఇన్‌ఛార్జి గారి అనుమతితో ప్రవేశపెట్టబడు ఇతర విషయములు

ప్రదేశం : తెనాలి
తేది : 08/03/2023

సం/-వి.నిర్మల
పర్సన్ ఇన్‌ఛార్జి

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com